సాక్షి
పార్వతీపురం మన్యం

ఆదివారం । 21 । జూలై । 2024



కాటేసిన కనుపాప

మొన్నటికి మొన్న ఊయలలో నిద్రపోతున్న ఆరు నెలల చిన్నారిపై అఘాయిత్యం మరచి పోక ముందే మరో ఘోరం!

- 8లో



ఆద్యంతం.. ఉత్కంఠ భరితం

జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న జిల్లా స్థాయి చాంపియన్‌షిప్ పోటీలు ఆద్యంతం ఉత్కంఠ భరితంగా సాగుతున్నాయి.

- 8లో



పంట నష్టంపై ప్రాథమిక నివేదిక

తుఫాన్ వర్షాల వలన దెబ్బతిన్న పంటలను పరిశీలించి ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక అందజేస్తామని జిల్లా వ్యవసాయాధికారి వీటీ రామారావు తెలిపారు.

- 8లో

న్యూస్‌రీల్

శిక్షణ సద్వినియోగం కావాలి : డీఈఓ



ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతున్న డీఈఓ పగడాలమ్మ

పాలకొండ రూరల్: తరగతి గదిలో విద్యార్థులకు మెరుగైన బోధన అందించేందుకు ఇస్తున్న టీచ్ టూల్ శిక్షణను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ జి.పగడాలమ్మ అన్నారు. పాలకొండ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో డివిజన్ స్థాయి ఉపాధ్యాయులకు ఉప విద్యాశాఖాధికారి పి.కృష్ణారావు పర్యవేక్షణలో అందిస్తున్న శిక్షణ తరగతులను ఆమె శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సృజనాత్మక, గుణాత్మకతతో కూడిన బోధనకు సంబంధించి నేటి పరిస్థితులను అనుగుణంగా ఉపాధ్యాయులు సిద్ధం కావాలని సూచించారు. రాష్ట్ర విద్యా శాఖ రూపొందించిన టీచ్ టూల్ కార్యక్రమం విద్యార్థులకు ఉపయోగపడేలా చూడాలని డీఈఓ పేర్కొన్నారు. ఎంఈఓ కురిటి సోంబాబు తదితరులు పాల్గొన్నారు.

అంటువ్యాధులపై తస్మాత్..: డీఎంహెచ్‌ఓ



భామిని పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ విజయపార్వతి

భామిని: వర్షాలు విస్తారంగా కురిసిన క్రమంలో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని పార్వతీపురం మన్యం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ కె.విజయపార్వతి సూచించారు. మండలంలోని బత్తిలి, భామిని పీహెచ్‌సీలను ఆమె శనివారం సందర్శించారు. జ్వరాల తీవ్రతను అడిగి తెలుసుకున్నారు. మనుమకొండలో బత్తిలి వైద్యాధికారి కొండపల్లి రవీంద్ర ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక వైద్య శిబిరంలో పాల్గొని వైద్య సేవలు పరిశీలించారు. గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థుల ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, వేడి నీరు వాడకంపై సూచించారు. పీహెచ్‌సీలో ఓపీలు పరిశీలించి రోగులతో మాట్లాడారు. భామిని పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలించి ఓపీపై వైద్యాధికారి సోయల్ నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఆమె వెంట వైద్య సిబ్బంది ఉన్నారు.

‘ఉద్యాన’ సాగుకు
గిరిజన రైతులను ప్రోత్సహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: ఉద్యాన పంటల సాగులో గిరిజన రైతులకు అధిక ప్రాధాన్యమిచ్చి ప్రోత్సహించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లాలో ఆయిల్ పామ్ తదితర పంటల సాగుపై ఉద్యాన శాఖ అధికారులు, ఆయిల్ పామ్ కంపెనీల ప్రతినిధులతో సమీక్షా సమావేశం శనివారం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యానశాఖ అధికారులు లక్ష్యానికి మించి పని చేయాలని సూచించారు. జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెంచేందుకు అనుకూలమైన భూములను గుర్తించాలన్నారు. ఆయిల్‌పామ్ సాగు చేసేందుకు ఆసక్తి గల గిరిజన రైతులకు ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. సాగు విస్తరణ, పంట సాగుపై రైతులలో ఆసక్తి పెంచేందుకు అవగాహన కల్పించాలన్నారు. ఆయిల్‌పామ్ పంట నుంచి ఆదాయం వచ్చే వరకు మూడు సంవత్సరాల పాటు అంతర పంటల సాగును ప్రోత్సహించాలని తెలిపారు. మొక్కలు పంపిణీ వెంటనే పూర్తి చేయాలని అన్నారు. మొక్కలు నాటి వాటికి డ్రిప్ మంజూరు చేసి అమర్చాలని ఉద్యాన శాఖ అధికారులను ఆదేశించారు. సెప్టెంబరు నాటికి 50 శాతం లక్ష్యాలు పూర్తి చేయాలని తెలిపారు. ఎస్టీ, ఎస్సీ, బీసీ వర్గాలకు చెందిన చిన్న, సన్నకారు రైతులకు ఉద్యానవన పంటలు సాగు చేసేందుకు ఎన్‌ఆర్‌జీఎస్ పథకం ద్వారా అనుసంధానం చేసి, రైతులు తమ పొలంలోనే పని చేసి ఉపాధి పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇన్‌చార్జ్ జిల్లా ఉద్యానశాఖ అధికారి వి.రాధాకృష్ణ జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు వివరాలు తెలియజేసారు. జిల్లాలో 50 వేల ఎకరాలలో సాగులో వుందని, ఈ సంవత్సరం నాలుగు వేల ఎకరాలు సాగు చేసేలా లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు తెలిపారు. 5 వేల ఎకరాల భూమి సాగుకు అనుకూలమైనదిగా గుర్తించినట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.రామచంద్రరావు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి డా.ఎంవీఆర్ కృష్ణాజీ, మండల ఉద్యాన అధికారులు, ఆయిల్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఐటీడీఏలకు కొత్త పీఓలు

- పార్వతీపురం పీఓగా సేదు మాధవన్
- సీతంపేట పీఓగా రాహుల్‌కుమార్ రెడ్డి



పీఓ సేదు మాధవన్

పార్వతీపురం టౌన్: పార్వతీపురం ఐటిడీఏ పీఓగా సేదు మాధవన్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు శనివారం జారీ చేసింది. ఈయన ఇప్పటి వరకు నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా విధులు నిర్వహించారు. ఇప్పటి వరకు పార్వతీపురం ఐటీడీఏ పీఓగా విధులు నిర్వహించిన సి.విష్ణుచరణ్‌ను నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహించిన నిషాంత్‌కుమార్‌కు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డైరెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

సీతంపేట: సీతంపేట ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా 2020 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన తాటిమకుల రాహుల్‌కుమార్ రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన నంద్యాల జిల్లా జేసీగా పని చేస్తూ ఇక్కడకు బదిలీపై రానున్నారు. సివిల్స్‌లో 117వ ర్యాంకు సాధించిన ఆయన స్వస్థలం కడప జిల్లా పెండ్లిమర్రి మండలంలోని నందిమండల గ్రామం. తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో బీటెక్ పూర్తి చేసిన ఆయన ఆరో ప్రయత్నంలో సివిల్స్‌లో విజయం సాధించారు.

తిరుపతి జేసీగా శుభం బన్సల్

సీతంపేట ఐటీడీఏ పీఓగా పని చేస్తున్న శుభం బన్సల్ తిరుపతి జేసీగా బదిలీ అయ్యారు. ఈయన కొద్ది నెలల పాటు పీఓగా పని చేశారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో పని చేసిన కల్పనాకుమారిని ఎన్నికల కమిషన్ బదిలీ చేయడంతో ఆ స్థానంలో శుభం బన్సల్ నియమింపబడ్డారు. నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్‌గా పని చేశారు. ఎన్నికల అనంతరం వ్యక్తిగత పనుల కోసం సెలవుపై వెళ్లారు. ప్రస్తుతం ఇన్‌చార్జ్‌గా పార్వతీపురం ఐటీడీఏ పీఓ విష్ణు చరణ్ వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో కొత్త పీఓగా రాహుల్‌కుమార్‌రెడ్డిని ఇక్కడ నియమించారు.

సొంత జిల్లాలకు తహసీల్దార్లు

పార్వతీపురం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇతర జిల్లాల నుంచి బదిలీపై వచ్చిన తహసీల్దార్లు వారి సొంత జిల్లాలకు బదిలీ అయ్యేందుకు ప్రభుత్వం ప్రత్యేక జీఓను జారీ చేసింది. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఇతర జిల్లాల్లో పని చేసిన తహసీల్దార్లు, కలెక్టరేట్, ఆర్డీఓ కార్యాలయాల్లో పని చేసిన అధికారులు వారి సొంత జిల్లాలకు రానున్నారు. దీనికి సంబంధించి ప్రక్రియ త్వరలో ప్రారంభం కానుంది. జిల్లాలో 15 మండలాల తహసీల్దార్లు, కలెక్టరేట్ సిబ్బంది, సొంత జిల్లాలకు రానున్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన తరువాత కలెక్టర్ వారిని మండలాలకు కేటాయించనున్నారు.

వీరఘట్టం రహదారిలో పొలాల్లో చేరిన నీరు



తెరిపిచ్చిన వాన



నాగావళి నదీతీర గ్రామమైన గోపాలపురంలో ప్రజలను అప్రమత్తం చేస్తున్న అధికారులు

సాక్షి, పార్వతీపురం మన్యం: అల్పపీడనం ప్రభావంతో రెండు రోజులుగా ఏకధాటిగా కురిసిన వర్షాలు.. కాస్త తెరిపిచ్చాయి. జిల్లా వ్యాప్తంగా వాతావరణం మబ్బు పట్టినప్పటికీ.. అక్కడక్కడ మోస్తరు వానే కురిసింది. ముందు జాగ్రత్త చర్యలుగా జిల్లాలోని అన్ని పాఠశాలలకూ శనివారం సెలవు ప్రకటించారు. పంట పొలాల్లో నీరు చేరడంతో రైతులు వ్యవసాయ పనులకు ఉపక్రమించారు.

44.7 మి.మీ. వర్షపాతం నమోదు

అల్పపీడనం ప్రభావంతో శుక్రవారం నుంచి శనివారం ఉదయం వరకు జిల్లావ్యాప్తంగా 44.7 మి.మీ. సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా సీతంపేట 72.6 మి.మీ., కురుపాం 70.8, గరుగుబిల్లి 64.0, బలిజిపేట 59.6, పాలకొండ 51.6 మి.మీ. చొప్పున కురవగా.. అత్యల్పంగా మక్కువ 23.0, జీఎల్‌పురం 22.8 మి.మీ. చొప్పున వాన పడింది. శనివారం రోజంతా వాతావరణం మేఘావృతమైనప్పటికీ, అడపాదడపా తప్ప పెద్దగా వాన ప్రభావం లేదు.


నదీతీర ప్రాంతాల్లో అప్రమత్తం

రెండు రోజుల పాటు కురిసిన వర్షాలకు జిల్లాలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధానంగా నాగావళి నదితో పాటు, భామిని మండల పరిసరాల్లో వంశధార తీరంలోకి వరద నీరు చేరింది. చెరువులు, వాగులు, వంకల్లో జలకళ సంతరించుకుంది. మండల స్థాయి అధికారులు నదీ తీర ప్రాంత ప్రజలను అప్రమత్తంగా ఉండాలని, రోజువారీ కార్యకలాపాలకు సైతం తీరం దరిదాపుల్లోకి వెళ్లకూడదని సూచించారు. పాలకొండ నియోజకవర్గంలో 7 వేల ఎకరాల్లో వెదలు, నాట్లు పూర్తి చేసిన పంట పొలాల్లోకి కొంత మేర నీరు చేరింది. దీనివల్ల పంటలకు ఇబ్బందేమీ లేదని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

సాలూరులో ‘గ్రీవెన్స్’ రేపు

పార్వతీపురం: ప్రజా సమస్యల పరిష్కార వేదికను (గ్రీవెన్స్) సాలూరులో సోమవారం నిర్వహించనున్నట్టు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాలూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వినతులను స్వీకరించనున్నట్టు పేర్కొన్నారు. గ్రీవెన్స్‌కు జిల్లా అధికారులందరూ హాజరు కావాలని ఆయన ఆదేశించారు.

నిలకడగా ‘తోటపల్లి’



తోటపల్లి ప్రాజెక్టులో నీటి ప్రవాహం

గరుగుబిల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు తోటపల్లి ప్రాజెక్టు వద్ద నీటిప్రవాహం నిలకడగా వుంది. నాగావళి నదిలో తోటపల్లి ప్రాజెక్టు వద్ద శనివారం సాయంత్రానికి 105 మీటర్ల లెవిల్‌కుగాను 104 మీటర్ల లెవిల్‌లో నీరు నిల్వ వుంది. ప్రస్తుతం నది పైభాగం నుంచి ప్రాజెక్టుకు 1657 క్యూసెక్కుల నీరు రాగా ఈ మేరకు అధికారులు రెండు గేట్లును ఎత్తివేసి 2139 క్యూసెక్కుల నీటిని నదిలోకి విడిచిపెడుతున్నారు. అలాగే కాలువల ద్వారా 210 క్యూసెక్కుల నీటిని విడిచి పెడుతున్నారు. ప్రాజెక్టు నీటి సామర్థ్యం 2.53 టీఎంసీలకుగాను 2.136 టీఎంసీల నీటి సామర్థ్యం వున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ప్రాజెక్టు వద్ద నీటి పరిస్థితిని ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు.





క్లుప్తంగా

పెదకుదమలో గజరాజులు



పెదకుదమ వద్ద రహదారి దాటుతున్న ఏనుగులు

జియ్యమ్మవలస: మండలంలోని పెదకుదమ పంట పొలాలలో శనివారం సాయంత్రం ఏనుగులు దర్శనమిచ్చాయి. పంట పొలాల నుంచి రహదారిపైకి రావడంతో గ్రామస్తులు భయాందోళనలు చెందుతున్నారు. అరటి, పామాయిల్ తోటలను ధ్వంసం చేయడంతో పాటు వరినారు మళ్లలోకి ప్రవేశించే అవకాశం ఉందని వాటిని తరలించే ప్రయత్నం చేయాలని రైతులు కోరుతున్నారు. రాత్రి సమయాన గ్రామంలోకి వచ్చే అవకాశముందని రైతులు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖాధికారులు సూచించారు.

విద్యుదాఘాతంతో మేకల మృతి

మెరకముడిదాం: మండలంలోని ఇప్పలవలస గ్రామంలో విద్యుత్ షాక్‌తో రెండు మేకలు శనివారం మృతి చెందాయి. వివరాల్లోకి వెళ్తే.. ఇప్పలవలస గ్రామానికి చెందిన కన్నూరి గణనాథ తన మేకలను మేత కోసం పొలాల్లోకి తీసుకువెళ్లాడు. మధ్యాహ్నం పొలాల్లో మేస్తున్న మేకలు పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లేసరికి షాక్‌కు గురయ్యాయి. అక్కడికక్కడే రెండు మేకలు మృతి చెందాయి. మరో మేక తప్పించుకొని పారిపోయింది. మృతి చెందిన రెండు మేకల విలువ సుమారు రూ.30 వేలు ఉంటుందని పెంపకందారుడు బోరుమన్నాడు. తనకు ప్రభుత్వం సాయం చేసి ఆదుకోవాలని కోరాడు.

వ్యక్తి ఆత్మహత్య



చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

విజయనగరం క్రైమ్: స్థానిక సెంతకాల బ్రిడ్జి పక్కన ఉన్న రైల్వే ప్రహరీ గోడ పక్కన ఉన్న చెట్టు కొమ్మకు ఉరి వేసుకొని సుమారు 50 ఏళ్ల వయసు కలిగిన వ్యక్తి శనివారం మృతి చెందాడు. స్థానికులు అందించిన సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న రైల్వే జీఆర్‌పీ ఎస్‌ఐ రవివర్మ విచారణ చేపట్టారు. మృతుడు కాఫీ రంగు, గులాబీ రంగు నిలువు గీతలు కలిగిన తెలుపు షర్ట్, నీలం రంగు లుంగీ ధరించి ఉన్నాడన్నారు. తెలుపు రంగు చుక్కలు కలిగిన ఆకుపచ్చ రంగు టవల్‌తో ఉరి వేసుకున్నట్లు గుర్తించామన్నారు. మృతుని ఆచూకీ ఇంకా తెలియరాలేదని, ఆచూకీ తెలిసిన వారు 94906 17089 నంబరును సంప్రదించాలన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

త్వరితగతిన పనులు పూర్తి చేయండి

- డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్



మాట్లాడుతున్న డీఈవో ప్రేమ్‌కుమార్

వంగర: పాఠశాలల్లో పెండింగ్‌లోని నాడు–నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ ఆదేశించారు. మండలంలోని యూకేగుమ్మడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడ ఫేజ్–2లో చేపట్టిన నాడు–నేడు పనులను పరిశీలించి, ఇప్పటివరకు జరిగిన పనులు, పెండింగ్‌లోని పనులు, పనులకు వెచ్చించిన నిధులపై ప్రధానోపాధ్యాయుడు సోమేశ్వరరావును ఆరాతీశారు. విద్యార్థుల విద్యాప్రమాణాలు మెరుగుపరచాలని, చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యాప్రగతిపై ప్రత్యేక దృష్టి సారించాని తెలిపారు. సమయపాలన పాటించి, ఆదర్శంగా నిలవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు ప్రవీణ్‌కుమార్, వై.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

రామతీర్థంలో ప్రత్యేక పూజలు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థంలో కొలువైన శ్రీసీతారామస్వామికి ఆలయ అర్చకులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున స్వామి వారికి ప్రాతఃకాలార్చన, బాలభోగం నిర్వహించిన తర్వాత యాగశాలలో సుందరాకాండ హవనం జరిపించారు. అనంతరం స్వామి వెండి మంటపం వద్ద సీతారాముల నిత్య కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా జరిపించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. గ్రామీణ కళాకారుల సంఘం అధ్యక్షుడు పైడిరాజు ఆధ్వర్యంలో జిల్లాకు చెందిన పలువురు కళాకారులు స్వామి సన్నిధిలో చేపట్టిన భక్తి భజనలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఈ పూజలకు హాజరై, స్వామి వారిని దర్శించుకున్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹115	₹200	₹210

కాటేసిన కనుపాప

- కన్న కూతురిపై తండ్రి అఘాయిత్యం
- తల్లి ఊరెళ్లడంతో కన్నేసిన కిరాతక తండ్రి
- అమ్మమ్మ తలుపు తట్టడంతో బయట పడ్డ ఘోరం
- ఆస్పత్రికి బాలిక తరలింపు
- పరారైన తండ్రి



బాధితురాలి ఇరుగుపొరుగు ఇళ్ల వద్ద ఆరా తీస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

బొబ్బిలి: మొన్నటికి మొన్న ఊయలలో నిద్రపోతున్న ఆరు నెలల చిన్నారిపై అఘాయిత్యం మరచిపోక ముందే మరో ఘోరం! చిన్నారిపై అకృత్యం తెలిసి సభ్య సమాజం ఎటు వెళ్తోందో అర్థం చేసుకునే లోపే మరో కిరాతకం! మైనర్ బాలికైన పన్నెండేళ్ల కన్న కూతురిపైనే అఘాయిత్యానికి పాల్పడ్డాడో దుర్మార్గపు తండ్రి! కంటికి రెప్పలా కాపాడాల్సిన తండ్రే కాటేశాడు. తండ్రి అనే బంధానికే తలవంపులు తెచ్చే ఘోరమైన సంఘటన బొబ్బిలి పట్టణం ఇందిరమ్మ కాలనీలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకోగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో ఓ అద్దె ఇంట్లో నివాసముంటున్న నర్సింగ్‌కు భార్య మంగమ్మ, వృద్ధురాలైన అత్త ఉన్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు. ఇటీవలే పెద్ద కుమార్తె రజస్వల అయింది. నర్సింగ్ అత్త పలు ఇళ్లల్లో పాచి పనులు చేసుకుని కుటుంబాన్ని పోషిస్తోంది. నర్సింగ్ కూడా మొన్నటి వరకూ కోళ్ల ఫారంలో పని చేస్తూ మానేసి ఈ మధ్యే పెయింటింగ్ పనులకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం మంగమ్మ విజయనగరం వెళ్లింది. అమ్మమ్మ వీధిలో పనుల నిమిత్తం వెళ్లింది. ఇంట్లో పిల్లలు, నర్సింగ్ ఉన్నారు. దీంతో తండ్రి పన్నెండేళ్ల కుమార్తెపై అఘాయిత్యానికి ఒడిగట్టాడు. ఈ సమయంలో చిన్నారి అమ్మమ్మ పనులు ముగించుకుని టీ తాగి మళ్లీ పనికి వెళ్దామని ఇంటికి రాగా తలుపులేసి ఉన్నాయి. ఆమె తలుపు తట్టినా తీయక పోవడంతో వెనుకవైపు ఉన్న బలహీనమయిన తలుపు వచ్చేసింది. ఈ సమయంలో చిన్నారి వివస్త్రగా గదిలో ఓ మూల ఉండటం చూసిన అమ్మమ్మ భయపడి పెద్దగా కేకలేసింది. దీంతో చుట్టుపక్కల వారు కూడా వచ్చి చిన్నారి పరిస్థితిని చూసి బాలికకు దుస్తులు వేశారు. విషయం తెలుసుకున్న సోషల్ వర్కర్ కుప్ప రమణమ్మ ఈ విషయమై నర్సింగ్‌ను, భార్య మంగమ్మను నిలదీసింది. నర్సింగ్ భార్య అతనిని వెనకేసుకు రావడంతో పరిస్థితి బాలేదని పోలీసులకు సమాచారమిచ్చింది. వారి అత్త కూడా ఇరుగుపొరుగు వారికి చెప్పడంతో పోలీసులు రంగంలోకి దిగారు. డీఎస్పీ పి.శ్రీనివాసరావు బాడంగి మహిళా ఎస్సై జయంతి సహకారంతో బాలికను ఆస్పత్రికి తరలించి పరీక్షలు చేయించారు. ఆస్పత్రికి, బాధితురాలి ఇంటికి డీఎస్పీ వెళ్లి చుట్టుపక్కల వారిని ప్రశ్నించారు. ఘటనపై ఆరా తీశారు. భర్తను వెనుకేసుకు వస్తున్న భార్య, నర్సింగ్‌తో పాటు కుటుంబ సభ్యులు పరార్ అయినట్టు నిర్ధారించుకున్నారు. అనంతరం డీఎస్పీ శ్రీనివాసరావు విలేకర్లతో మాట్లాడుతూ బాలికను పరీక్షించిన వైద్యులు ఏమీ జరగలేదని చెప్పారన్నారు. రిపోర్టులు కూడా తీసుకుంటున్నామన్నారు. బాలిక అమ్మమ్మ, ఇతర కుటుంబ సభ్యులు, బాధితురాలి ఫిర్యాదును అనుసరించి పోక్సో కేసు నమోదు చేయనున్నట్టు డీఎస్పీ తెలిపారు. ఈ విషయమై హోం మంత్రి పేషీ నుంచి ఏం జరిగిందో వెంటనే వివరాలిమ్మని అడిగే వరకూ స్థానిక పోలీసులు కూడా విషయాన్ని మీడియాకు సమాచారమివ్వక పోవడం విచారకరం.

ఇద్దరి బలవన్మరణం

- వివాహేతర సంబంధమే కారణం



మృతిచెందిన వెంకటరావు



మృతిచెందిన అన్నపూర్ణ

సీతంపేట: సీతంపేట ఏజెన్సీలోని జరడు కాలనీకి చెందిన ఇద్దరు వివాహేతర సంబంధం నేపథ్యంలో బలవన్మరణానికి పాల్పడ్డారు. కాలనీకి చెందిన తాడంగి అన్నపూర్ణ(30), తాడంగి వెంకటరావు(35) విషం తాగి తనువు చాలించారు. పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళ్తే.. జరడు కాలనీలో కొంత కాలంగా అన్నపూర్ణ, వెంకటరావు నివాసం ఉంటున్నారు. అన్నపూర్ణ 2014లో అదే గ్రామానికి చెందిన టి.కృష్ణారావును ప్రేమ వివాహం చేసుకుంది. వీరికి నలుగురు మగ పిల్లలు జన్మించగా.. ఇద్దరు మృతి చెందగా సిద్ధూ, అరవింద్ ఉన్నారు. అదే గ్రామానికి చెందిన తాడంగి వెంకటరావుకు భార్య, కుమార్తె ఉన్నారు. ఈ క్రమంలో అన్నపూర్ణ, వెంకటరావు మధ్య కొంత కాలంగా వివాహేతర సంబంధం నడుస్తోంది. ఈ నేపథ్యంలో ఈ నెల 4వ తేదీన ఇద్దరూ గ్రామంలో కనిపించకుండాపోయారు. దీంతో ఈ నెల 8న సీతంపేట పోలీస్‌స్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్న క్రమంలోనే జరడు కాలనీకి చెందిన సూర్యారావుకు పక్క గ్రామమైన తుంబలి గ్రామస్తుడు కె.సుమంత్ ఫోన్ చేసి అన్నపూర్ణ, వెంకటరావు హైదరాబాద్‌లోని అమీర్‌పేటలో ఉన్నారని సమాచారం ఇచ్చాడు. దీంతో చిన్నబగ్గ సర్పంచ్ నీలయ్యతో పాటు పలువురు గ్రామ పెద్దలు హైదరాబాద్ నుంచి వారిని తీసుకు రావడానికి ఈ నెల 16న వెళ్లారు. అక్కడ కౌన్సెలింగ్ చేసి ఈ నెల 18న కారులో బయలుదేరి వచ్చారు. మార్గంలో మండలంలోని కుశిమి జంక్షన్‌కు వచ్చేసరికి ఇద్దరూ పాస్‌కు వస్తుంది ఆపమని కారు నిలుపుదల చేయించారు. పొదల మాటుకు వెళ్లి విషం తీసుకున్నారు. కొద్ది సేపటికి నోటి నుంచి చొంగలు రావడంతో వెంటనే శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ వైద్యం చేసిన అనంతరం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి అన్నపూర్ణ చనిపోగా, శనివారం ఉదయం వెంకటరావు మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ జగ దీష్‌నాయుడు తెలిపారు.

క్షేత్ర స్థాయిలో మలేరియా కేసుల పరిశీలన



పాతవూరులో గతంలో వచ్చిన మలేరియా కేసులను పరిశీలించిన జోనల్ మలేరియా అధికారిణి శాంతిప్రభ

- జోనల్ మలేరియా అధికారిణి శాంతిప్రభ

వేపాడ: మండలంలోని కొండగంగుబూడి పంచాయతీలో మలేరియా కేసులను జోనల్ మలేరియా అధికారిణి ఎం.శాంతిప్రభ శనివారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. బొద్దాం పీహెచసీ పరిధిలోని కొండగంగుబూడి పంచాయతీ పాతవూరులో ఈ ఏడాది నమోదైన ఎనిమిది కేసులను పరిశీలించి వారి ఆరోగ్యంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె గ్రామస్తులతో మాట్లాడారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. సీజనల్ వ్యాధులు, మలేరియా, డయేరియా, డెంగీ వంటి వ్యాధుల బారిన పడకుండా తగు జాగ్రత్తలు పాటించాలని అన్నారు. అనంతరం బొద్దాం పీహెచ్‌సీని సందర్శించిన ఆమె సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామాల్లో ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలని, వారానికొకసారి డ్రై డే పాటించేలా క్షేత్ర స్థాయిలో గ్రామస్తులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆమె వెంట మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసరావు, ఎంపీహెచ్‌ఎస్ మూర్తి, ఎంపీహెచ్‌ఈవో తిరుపతి రావు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మన్యంలో విస్తారంగా కురిసిన వర్షాలు



పార్వతీపురంలో కురిసిన వర్షం

పార్వతీపురం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసాయి. శుక్రవారం, శనివారాలలో జిల్లాలోని పలు ప్రాంతాలలో వర్షం కురిసింది. వర్షాలకు చెరువులలో, వాగులలో, పంట పొలాలలో నీరు చేరింది. వరి ఉభాలు గ్రామాలలో ఊపందుకున్నాయి. జిల్లాలో 670.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు పేర్కొన్నారు.

మండలాల వారీగా వర్షపాతం

మండలం	వర్షంపాతం (మిల్లీమీటర్లలో..)
వీరఘట్టం	45.6
సీతంపేట	72.6
భామిని	45.6
పాలకొండ	51.6
కొమరాడ	25.2
గుమ్మలక్ష్మీపురం	22.8
కురుపాం	70.8
జియ్యమ్మలస	34.6
గరుగుబిల్లి	64.0
పార్వతీపురం	47.8
మక్కువ	23.0
సీతానగరం	44.6
బలిజిపేట	59.6
సాలూరు	32.6
పాచిపెంట	29.8
మొత్తం	670.2

పెద్దగెడ్డ గేట్లు ఎత్తివేత



పెద్దగెడ్డ గేట్లు ఎత్తివేయడంతో దిగువకు వెళ్తున్న నీరు

పాచిపెంట: ఇటీవల కురుస్తున్న వర్షాలకు పెద్దగెడ్డ జలాశయంలో నీటి ఉధృతి పెరిగింది. నీటి మట్టం పెరగడంతో శనివారం జలాశయం రెండు గేట్లను అధికారులు ఎత్తివేసారు. 250 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్టు పెద్దగెడ్డ జలాశయం జేఈ రవి తెలిపారు.

పంట నష్టంపై ప్రాథమిక నివేదిక

- జిల్లా వ్యవసాయాధికారి రామారావు



వరినారును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి రామారావు తదితరులు

దెంకాద:

తుఫాన్ వర్షాల వలన దెబ్బతిన్న పంటలను పరిశీలించి ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక అందజేస్తామని జిల్లా వ్యవసాయాధికారి వీటీ రామారావు తెలిపారు. మండలంలోని సింగవరం పరిధిలో దెబ్బతిన్న నువ్వు పంటను ఆయన శనివారం పరిశీలించారు. రైతులు సాగు చేస్తున్న వరి వెద, యంత్రాలతో ఉభాలు చేసేందుకు వేసిన వరినారును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి రామారావు మాట్లాడుతూ మండలాల నుంచి వచ్చిన పంట నష్టం ప్రాథమిక లెక్కల మేరకు జిల్లా స్థాయిలో నష్టపరిహారం లెక్కిస్తామన్నారు. ఆయన వెంట ఏడీఏ ఎ.నాగభూషణం, ఏఈఓ రామకోటి తదితరులు ఉన్నారు.

భవనం పైనుంచి పడి మేస్త్రీ దుర్మరణం



రౌతు పాపారావు (ఫైల్)

ఆరిలోవ(విశాఖ తూర్పు): జీవీఎంసీ తొమ్మిదో వార్డు విశాలాక్షినగర్‌లో జరుగుతున్న భవన నిర్మాణ పనుల్లో ప్రమాదవశాత్తు లేబర్ మేస్త్రీ రౌతు పాపారావు(45) మృతి చెందాడు. ఆరిలోవ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు.. విశాలాక్షినగర్‌లో ఓ వ్యక్తి భవన నిర్మాణం చేపడుతున్నాడు. ఇందులో భాగంగా శనివారం లిఫ్ట్ ఏర్పాటు పనులు చేపట్టారు. లిఫ్ట్ అమర్చే క్రమంలో భవనం రెండో ఫ్లోర్‌లో ఉండగా.. దాని అడుగు భాగం తొట్టి లేబర్ మేస్త్రీ రౌతు పాపారావుపై జారి పడింది. దానితో పాటు కింద పడిన మేస్త్రీ తలకు తీవ్రగాయాలై మెడ భాగం కొంత కోసుకుపోవడంతో ప్రాణాలు కోల్పోయాడు. ఆరిలోవ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పాపారావు మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బతుకుతెరువు కోసం వచ్చి..

రౌతు పాపారావుది విజయనగరం జిల్లా మెంటాడ మండలం పోరాం గ్రామం. అక్కడ నుంచి కొన్నేళ్ల కిందట బతుకు తెరువు కోసం విశాఖపట్నం వచ్చి 10వ వార్డు రవీంద్రనగర్‌లో కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. అతడికి భార్య గౌరి, ఇద్దరు పిల్లలున్నారు. భవన నిర్మాణ పనుల్లో లేబర్ మేస్త్రీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇద్దరు పిల్లల్లో పెళ్లీడు కొచ్చిన కుమార్తె ప్రైవేట్ ఉద్యోగం చేస్తుండగా.. కుమారుడు చదువుతున్నాడు. కుటుంబాన్ని పోషించే పాపారావు మృతి చెందడంతో అతడి భార్య, కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

టోల్‌గేట్‌ను తరలించాలి

- కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీకి మంత్రి కొండపల్లి లేఖ



మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం అర్బన్: జిల్లాలోని జొన్నాడ సమీపంలోని బోడమెట్టపాలెం వద్ద ఏర్పాటు చేసిన టోల్ గేట్‌ను బైపాస్ రోడ్డులోకి మార్చాలని కేంద్ర ఉపరితల రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్‌గడ్కరీకి రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ లేఖ రాశారు. ఈ టోల్ గేట్ వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని వాహనదారులకు పెనుభారంగా మారిందని ఆ లేఖలో పేర్కొన్నారు. టోల్‌గేట్ ఏర్పాటు చేసే ముందు తీసుకోవాల్సిన చర్యలను చేపట్టలేదని నిబంధనలను పాటించలేదని పేర్కొన్నారు. రాయపూర్–విశాఖపట్నం 26వ జాతీయ రహదారి (ఎన్‌హెచ్–43)పై మోదవలస నుంచి గొట్లాం వరకు రోడ్డును విస్తరించి నాలుగు లేన్ల రహదారిగా నిర్మాణం పూర్తి చేసి దాదాపు ఐదేళ్ల క్రితమే వినియోగంలోకి తెచ్చారని తెలిపారు. ఇప్పుడు ఈ రోడ్డుపై కొత్తగా టోల్ ప్లాజాను ఏర్పాటు చేయడం నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. వాస్తవానికి వినియోగంలోకి వచ్చిన 45 రోజుల్లోనే టోల్‌ప్లాజాను ఏర్పాటు చేసి రుసుం వసూలు చేయాల్సి ఉందని కానీ వినియోగంలోకి వచ్చిన ఐదేళ్ల తరువాత ఇక్కడ టోల్‌ప్లాజాను ఏర్పాటు చేసి ఈ నెల 2వ తేదీ నుంచి వసూళ్లు మొదలు పెట్టారని వివరించారు. సామాన్య ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్న ఈ టోల్ ప్లాజాను కొత్తగా నిర్మించిన విజయనగరం బైపాస్ రోడ్డులోకిక తరలించాలని మంత్రి కొండపల్లి కోరారు.

ఆద్యంతం.. ఉత్కంఠ భరితం

- కొనసాగుతున్న జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు
- అండర్‌– 19, మెన్/ఉమెన్ విభాగాల్లో పోటీలకు 100 మంది హాజరు
- నేటితో ముగియనున్న పోటీలు



అండర్‌-15,17 బాలికల విభాగంలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు

విజయనగరం:

ప్రతిభ గల క్రీడాకారులను వెలికితీసి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత కల్పించటంలో భాగంగా జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న జిల్లా స్థాయి చాంపియన్‌షిప్ పోటీలు ఆద్యంతం ఉత్కంఠ భరితంగా సాగుతున్నాయి. నగరంలోని డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియం ప్రాంగణంలో మొత్తం నాలుగు రోజుల పాటు నిర్వహించతలపెట్టిన పోటీల్లో భాగంగా మూడవ రోజు శనివారం అండర్–19, మెన్/ ఉమెన్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 100 మంది క్రీడాకారులు తలపడ్డారు. సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో జరిగిన పోటీల్లో క్రీడాకారులు తమ ప్రతిభా పాటవాలను కనబరిచేందుకు ఉత్సుకత చూపించారు. జిల్లా స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు బహుమతులు ప్రధానం చేయటంతో పాటు త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా జట్టు తరుపున అవకాశం కల్పించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఇదిలా ఉండగా ఆదివారం చివరి రోజు వెటరన్స్ విభాగంలో పోటీలు నిర్వహించనున్నారు. 35 సంవత్సరాల వయస్సు పైబడిన క్రీడాకారులు ఈ పోటీల్లో తలపడనున్నారు.

అండర్‌-15, 17 విభాగాల్లో విజేతలు వీరే...

జిల్లా స్థాయిలో జరిగిన బ్యాడ్మింటన్ పోటీలు ఉల్లాసంగా.. ఉత్సాహంగా సాగుతున్నాయి. జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న పోటీల్లో అండర్ – 15, 17 విభాగాల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు అసోసియేషన్ ఉపాధ్యక్షులు డాక్టర్ వివిఎస్.ప్రసాద్, కార్యదర్శి నున్న సురేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శి కుటుంబరావు, ఉపాధ్యక్షుడు వై.కుసుంబచ్చన్ తదితరులు బహుమతులు ప్రధానం చేశారు. అండర్ – 15 బాలుర సింగిల్స్ విభాగంలో సిహెచ్.మేఘవర్స్, ఎంవి.నాగసాయిలు ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవసం చేసుకోగా... డబుల్స్ విభాగంలో సిహెచ్.మేఘవర్స్ – ఎం.జాన్సన్‌ల జట్టు, ఎం.వి.నాగసాయి – డి.రామ్‌చరణ్‌ల జట్లు మొదటి రెండు స్థానాలు చేజిక్కించుకున్నాయి. అండర్ – 15 బాలికల సింగిల్స్ విభాగంలో ఎం.ఉజ్వల, ఎండి. నిషాద్‌ఫాతిమాలు.... డబుల్స్ విభాగంలో ఎస్.లాస్యశ్రీ–ఎస్.లాస్యల జట్టు, బి.కీర్తి–ఎస్.హర్షిత జట్లు విజేతలుగా నిలిచారు. అండర్–17 బాలుర సింగిల్స్ విభాగంలో ఎం.రోహిత్, కె.లోకేష్‌లు ప్రథమ, ద్వితీయ స్థానాలు దక్కించుకోగా... డబుల్స్ విభాగంలో కె.లోకేష్–ఎం.రోహిత్‌ల జట్టు, ఎవి.భరద్వాజ్–ఎవి.చైతన్యల జట్లు విజేతలుగా నిలిచారు. బాలికల సింగిల్స్ విభాగంలో ఎం.ఉజ్వల, ఎస్.లాస్యలు మొదటి రెండు స్థానాలు చేజిక్కించుకోగా... డబుల్స్ విభాగంలో ఎం.ఉజ్వల–ఎం.మోక్షిత జట్టు, బి.విష్ణుప్రియ–ఎం.భూమికల జట్లు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో దక్కించుకున్నారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

STAR Health
WANTED
AGENCY & SALES MANAGER
Fixed Salary, Attractive incentives, Foreign Trips
STAR HEALTH & ALLIED INSURANCE CO. LTD
CONTACT: 9121688234, 9908488700
Email: lanka.srinivas@starinsurance.in
ఏజెంట్స్ కావలెను
లైఫ్ & జనరల్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్‌కి ఎటువంటి ఫీజు మరియు ఎగ్జామ్ లేకుండా స్టార్ ఏజెన్సీ పొందవచ్చు.
పోస్టల్ ఏజెంట్స్, చిట్స్ ఏజెంట్స్, టీచర్స్, రిటైర్డ్ ఎంప్లాయిస్, హౌస్‌వైఫ్స్ మొదలైన వారికి ఉచిత శిక్షణ మరియు పరీక్ష కల్పించబడును.

EDUCATION
■ AU డిస్టెన్స్ ఎడ్యుకేషన్ BA, B.Com, B.Sc, MA, M.Com, M.Sc, MBA, MCA & AP ఓపెన్‌స్కూల్ ద్వారా డైరెక్ట్ 10th & Inter One Sitting అడ్మిషన్లు జరుగుచున్నవి. పాస్ గ్యారంటీ గైడెన్స్. 94936 91926, 90590 86040 [V- 2630]

SITE FOR SALE
■ విజయనగరం, భోగాపురం, విశాఖపట్నం, బొబ్బిలిలలో హైవే రోడ్డుకి దగ్గరలో VMRDA approved స్థలాలు అమ్మకమునకు కలవు. @ 9618595746 [S- 1184914]

HOUSE FOR SALE
■ విజయనగరం సిటీలో గంటస్తంభం నుంచి 2 కిలోమీటర్ల దూరంలో కేవలం 33 లక్షలకు ఇండివిడ్యువల్ లగ్జరీ డబల్ బెడ్ రూమ్ ఇల్లు car parking సకల సౌకర్యాలతో 130 గజాలు 900 SFT వివరాలకు 9 143 143 818. [S- 1243406]

FOR RENT OR LEASE
■ శివగంగ మినరల్ వాటర్ ప్లాంట్ 5000 కెపాసిటి P/H టోటల్ స్టెయిన్‌లెస్ స్టీల్‌తో రన్నింగ్‌లో ఉన్న వాటర్ ప్లాంట్ అద్దె/ లీజుకు ఇవ్వబడును. సంప్ర॥ 9440030719, 8309979494 [S- 793779]

CHANGE OF NAME
I, CHUKKA APPALANARASAMMA legally wedded spouse of PF. Index No.3363236, Post and Grade : Sub staff - Daffedar, STATE BANK OF INDIA Pensioner, (LATE) CHUKKA GNANA PRAKASA RAO, presently residing at H.NO.1-13, Harajiana Veedhi, Lumburu Village, Voni Post, Palakonda Mandal, Parvathipuram Manyam District. PIN.532440, have changed my Name from CHUKKA VIMALA to CHUKKA APPALANARASAMMA, for all purposes.

TYRE HOUSE
■ TYRE HOUSE మా వద్ద అన్ని రకముల టైర్లు, ట్యూబులు సరసమైన ధరలకే అమ్మబడును. సం॥ప్ర॥ చిన్నవీధి, విజయనగరం. Ph: 9440192783. [S-793776]

HEALTH CARE
■ డా॥ నిర్మల వంగపండు MD - Gen, Med (DM-Neuro) Jimper మెదడు, నరములు, వెన్నెముక వ్యాధి నిపుణులు. ఆదివారం నుండి శుక్రవారం వరకు 9am to 6pm చూసెదరు. నిర్మల న్యూరో & జనరల్ మెడికల్ సెంటర్. VZM, Appointment : 63054 71147 [V- 1908]

వధువు కావలెను.
■ 2nd మ్యారేజ్, కులం పట్టింపులేదు వయస్సు 55, 5'8 H, ప్రైవేట్ ఎంప్లాయి వరుడికి వధువు కావలెను. ✆ : 77949 11019 [R-1229028]

BUSINESS OFFER
■ We are Ready to Invest Long Term Projects All Over the World. Ph : +91 8754809650 [IA-7028]

WANTED
■ మార్కెటింగ్ వాలంటీర్స్ - 20 పోస్టులు స్త్రీ/పు (వర్క్ ఫ్రం హోమ్) సేల్స్ మేనేజర్స్ -15000/- ఆఫీస్ అసిస్టెంట్స్ (స్త్రీ)-2, ఆఫీస్ బాయ్స్ -2 జీతం 5000 - 10000/- (వయస్సు : 35–45సం॥) VZM 7780727021 [S- 1243255]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సాప్ చేయగలరు. 95026 15217 [M-1185359]

■ విశాఖపట్నంలో రైల్వే, HPCL, Airport Ground Staff, Central Ware Housing godowns Supervisors, Data Entry Operator మరియు ప్రైవేట్ సంస్థల్లో అవుట్‌సోర్సింగ్‌లో పనిచేయుటకు ఆసక్తిగలవారు సంప్రదించండి. అర్హత:10th, ఇంటర్, డిగ్రీ. ఫోన్: 74162 13689. [V- 12393]

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు / పురుషులు, ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15000-40000, ఫ్రీ రూమ్+భోజనం. HYD. ఫోన్: 7895984445 [HA-390]

■ పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర॥ 9391912949, 040-40123376. [H-800428]

■ త్రినేత్ర హోంకేర్ హైదరాబాద్‌నందు వృద్ధులను ,పేషెంట్స్‌ను,చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీవసతి+ భోజ నం. జీతం:17K.ఫోన్: 8520980099, 8520874499 [H-796258]

■ Receptionist, Telecaller & B.Tech Electrical & Electronics, Fresher or Experienced. GLR Enterprises, Jagadamba, Vizag. Ph: 83748 16236 [H-796135]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.